సాక్షి నిజామాబాద్

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



సాదాబైనామాలకు చట్టబద్ధత?
సాదాబైనామాలపై రాసుకున్న భూ విక్రయ ఒప్పంద పత్రాలకు చట్టబద్ధత కల్పించడానికి భూభారతి ద్వారా లైన్ క్లియర్ కానుంది.
- 8లో ▸



ఒలింపిక్స్ లక్ష్యంగా..
బాలబాలికలు, యువత ఒలింపిక్స్ లక్ష్యంతో ముందుకు నడవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /21.9

వాతావరణం
ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలో 33/11 కేవీ వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ పీఎల్-1 ఫీడర్ విద్యుత్ సరఫరాలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని టౌన్ -1 ఏడీఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పులాంగ్ రోడ్ నుంచి దేవీ టాకీస్ చౌరస్తా వరకు గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు అడ్డురాకుండా రోడ్‌క్రాస్ అవుతున్న విద్యుత్ లైన్ ఎత్తు పెంచేందుకు 11 మీటర్ల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రికార్డులు సృష్టించిన వరదలు

- 13 రోజుల్లో నిజాంసాగర్‌లోకి 91.323 టీఎంసీల ఇన్‌ఫ్లో
- 78.770 టీఎంసీలు మంజీర పాలు




నిజాంసాగర్ : సంగారెడ్డి, మెదక్ జిల్లాలతో పాటు కామారెడ్డి జిల్లాలోని ఎగువ ప్రాంతాల్లో దంచికొట్టిన వర్షాలతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. గతంలో ఎప్పుడూ చూడని స్థాయిలో వచ్చిన వరదలు రికార్డులు సృష్టించాయి. ప్రాజెక్టులోకి ఈనెల 18 న ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. 13 రోజుల్లోనే నిజాంసాగర్‌లోకి 91.323 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇదే సమయంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తి 78.770 టీఎంసీల నీటిని మంజీర నదిలోకి వదిలారు. ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, నీటిని విడుదల చేయడం ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డని అధికారులు పేర్కొంటున్నారు.

మూడ్రోజుల్లో 34 టీఎంసీలు..
ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఈనెల 28 నుంచి 31 వరకు 34.296టీఎంసీల వరద నీరు రావడం గమనార్హం. ఇదే సమయంలో 35.748 టీఎంసీల నీటిని మంజీ ర నదిలోకి వదిలేశారు. మూడు రోజులలో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, నీటిని వదిలేయడం ప్రాజె క్టు చరిత్రలో మొదటిసారి కావడం గమనార్హం.

తొమ్మిదేళ్ల తర్వాత..
నిజాంసాగర్ ప్రాజెక్టులోకి తొమ్మిదేళ్ల తర్వాత ఒక రోజు గరిష్ఠ స్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. గతంలో 2016 సంవత్సరంలో ఒకరోజులో గరిష్టంగా 2 లక్షల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ఈనెల 28న గరిష్టంగా 2.5 లక్షల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. భారీ వరదలు రావడంతో ప్రాజెక్టుకు మరోవైపు ఉన్న 20 గేట్లను 36 ఏళ్ల తర్వాత ఎత్తాల్సి వచ్చింది.

నిజాంసాగర్‌కు కొనసాగుతున్న వరద



నిజాంసాగర్: కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తోంది. సింగూరు గేట్లను ఎత్తడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 74,784 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 14 గేట్ల ఎత్తి 1,15,633 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టునుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో మంజీర నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

నిజామాబాద్ చేరుకున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు ఆదివారం ముంబాయి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు చేరుకుంది. ఇటీవల బాసర బ్రిడ్జి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు రైళ్లను రద్దు చేశారు. గోదావరి నీటి మట్టం తగ్గడంతో శనివారం వంతెనను పరిశీలించిన తర్వాత అధికారులు రైళ్లకు అనుమతి ఇచ్చారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌కు పది రైళ్లు, పది ప్రత్యేక రైళ్లు యథావిధిగా నడుస్తాయని, రైల్వే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు చెప్పారు.



సాలూర: మందర్నాలో ఇంట్లో వరద నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న వాణిశ్రీ, నాగరాజు కుటుంబీకులు

కలలు కల్లలాయే..
ఆశలు ఆవిరాయే!



కందకుర్తి శివారులో కుళ్లిపోయిన సోయా పంట


- రైతులను నట్టేట ముంచిన వాన, వరద
- నీరు తేలిపోవడంతో పంటలు కుళ్లిపోయి చేలల్లో దుర్వాసన
- వరద నీటిలోనే ఇంకా వందలాది ఎకరాలు
- సర్వం కోల్పోయిన ముంపు గ్రామాల బాధితులు
- మూడ్రోజుల పాటు పునరావాస శిబిరాల్లో ఆశ్రయం
- తిరిగొచ్చి ఇళ్ల దుస్థితి చూసి కంటతడి పెట్టిన జనం

నాలుగు నెలల్లో కూతురు పెళ్లి చేయాలని ఒకరు.. సొంతిల్లు కట్టుకోవాలని మరొకరు.. పిల్లలను ఉన్నత చదువు చదివించాలని ఇంకొకరు.. ఇలా చాలా మంది రైతులు కన్న కలలు కల్లలయ్యాయి. మనమొకటి తలిస్తే.. విధి మరొకటి తలుస్తుందని.. భారీ వర్షాలు, వరదలు బోధన్ డివిజన్‌లోని పలువురు రైతుల ఆశలను నీట ముంచాయి. మరోవైపు వరదలో ఇళ్లు మునిగి సర్వం కోల్పోయిన బాధితులు తల్లడిల్లుతున్నారు. మూడు రోజులపాటు పునరావాస కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో తలదాచుకోగా వరద తగ్గి ఇళ్లకు వెళ్తే తడిసిన బియ్యం, పప్పులు, ఉప్పులు, బట్టలు, సామాన్లు కంటతడి పెట్టించాయి. బురదతో నిండిపోయిన ప్లేట్లు, గిన్నెలు, సామన్లు శుభ్రం చేసుకొని సర్దుకుంటున్నారు.

బోధన్/ బోధన్ రూరల్ / రెంజల్/ నవీపేట:
బోధన్ నియోజకవర్గంలోని గోదావరి, మంజీర నదుల పరీవాహకంలో బోధన్, రెంజల్, నవీపేట్ మండలాలు విస్తరించి ఉన్నాయి. మూడు రోజులుగా పంటల్లో చేరిన వరద వెళ్లకపోవడంతో సుమారు 20 వేల ఎకరాల్లో సోయా పంట దెబ్బతింది. మరో 20–25 రోజుల్లో కోతకు రావాల్సిన పంట కళ్ల ముందే కుళ్లిపోయి దుర్వాసన రావడంతో రైతు కంట కన్నీరు వస్తోంది. ఏ రైతును కదిలించినా వేదనను వెళ్ల గక్కుతున్నాడు. పొగాకు పంటను పండించి లక్షల్లో అప్పుల పాలైన రైతులు కనీసం సోయాతోనైనా కాస్త గట్టెక్కాలని కలలు కన్నారు. ఎకరానికి రూ.12వేల నుంచి 15వేల వరకు ఖర్చు చేశారు. పూత, కాత ఆశించిన స్థాయిలో రావడంతో దిగుబడులు బాగుంటాయని లోలోన ఆనందించారు. చివరి దశలో ఉన్న పంట కాస్త ఊడ్చిపెట్టుకపోవడంతో ఆర్థిక భారంతో కుంగిపోతున్నారు. చేను వద్దకు వెళ్లేందుకు ఇంకేం మిగిలిందని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.



30 ఏళ్లలో చూడని వరద..
బోధన్ మండలంలోని హంగర్గ గ్రామస్తులు మంజీర నది వరద, శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌తో మూడు రోజులపాటు అష్టకష్టాలు పడ్డారు. గంటల వ్యవధిలో వరద నీరు తన్నుకురావడంతో లోతట్టు ప్రాంత నివాసాల కుటుంబాలు బతుకుజీవుడా అంటూ కట్టుబట్టలతో ఇళ్లను ఖాళీ చేసి బంధువుల ఇళ్లు, సురక్షిత ప్రాంతాలకు వెళ్లి ఆశ్రయం పొందారు. పాడి పశువులు, మూగజీవాలను గ్రామంలోని ఎత్తైన ప్రాంతానికి తరలించారు. గడిచిన 30 ఏళ్లల్లో గ్రామానికి ఈ స్థాయిలో ఎప్పుడూ వరద రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సారి అనేక ఇండ్లల్లో వరద నీరు 7, 8 ఫీట్ల ఎత్తుకు చేరిందని, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, బీరువాలు, టీవీలు, ఫ్రిడ్జీలు వంటి ఎల్రానిక్ వస్తువులు పూర్తిగా పాడైపోయాయని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



హంగర్గలో మొలకెత్తిన శెనగలు, పెసర్ల నిల్వలు

పెళ్లి వాయిదా..



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఖాలేద్ బేగ్. రెంజల్ మండలం కందకుర్తి గ్రామం. ఈ సీజన్‌లో రెండు ఎకరాల్లో సోయా పంటను సాగు చేశాడు. పంట దిగుబడి ఆశాజనకంగా వస్తే మరో నాలుగు నెలల్లో కూతురి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టపోయి కూతురి పెళ్లిని మరో ఏడాది వాయిదే వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దెబ్బతిన్న సోయా, వరి, అరటి, బొప్పాయి క్షేత్రాలు

సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్, సాలూర, తగ్గెల్లి గ్రామాల శివారులోని వేలాది ఎకరాల్లో సాగు చేసిన సోయా, వరి, అరటి, బొప్పాయి, కూరగాయాలు, ఆకుకూరలు నీట మునిగి తీరని నష్టం కలిగింది. వరద నీటితో కొట్టుకువచ్చిన చెట్ల కొమ్మలు, తుంగ మొక్కలను పొలాల్లోంచి తొలగించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆదివారం వరద నీటిలోంచి పంటలు తేలాయి. మూడు వేల ఎకరాల్లో కాత దశలో ఉన్న సోయా మురిగిపోయింది. ఇతర పంటలు రంగుమారాయి. ఎకరానికి రూ.33 వేల చొప్పున కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. హున్సా శివారులోని వంద ఎకరాల అరటి పంట వరదకు దెబ్బతిన్నది. మూడు రోజులుగా నీరు ఉండడంతో మొక్క ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అరటి తోటలోని డ్రిప్‌పైపులు, ఇతర సామగ్రి కొట్టుకుపోయాయి.



హున్సా శివారులో అరటి తోటలో వరదనీరు

సొంతూళ్లకు దూరమై..
సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్ గ్రామాల ప్రజలు మూడు రోజులపాటు సొంతూళ్లకు దూరమయ్యారు. గురువారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్లల్లో తలదాచుకున్నారు. మంజీరలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఆదివారం వరకు ఇళ్లకు చేరుకొని శుభ్రం చేసుకున్నారు. మందర్నాలోని 80 నివాసాల్లోకి వరద నీరు చేరడంతో బియ్యం, పప్పు, ఇతర నిత్యావసర సరుకులు తడిసిపోయి కంపుకొడుతున్నాయని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశాల మేరకు మూడు గ్రామాల్లో సాలూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా వైద్య సేవలందించారు.

40 మునిగింది.. 5 ఎకరాలే మిగిలింది



ఈ సీజన్‌లో సోయాను 45 ఎకరాల్లో పండించా. వరదకు 40 ఎకరాలు నీట మునగగా ఐదు ఎకరాలే మిగిలింది. ఎకరానికి రూ. 15 వేల వరకు పెట్టుబడి పెట్టిన. కాత దశలో ఉండగానే వరద వచ్చి ముంచింది. మూడు రోజులుగా నీటిలోనే మునగడంతో కుళ్లి వాసన వస్తోంది. వంద శాతం పంట చేతికి రాదు.
– ఇమాంబేగ్, రైతు, కందకుర్తి

రూ.8 లక్షలు ఖర్చు పెట్టా..



25 ఎకరాల్లో సోయా, 15 ఎకరాల్లో వరి పంట సాగుకు రూ.8 లక్షల వరకు ఖర్చు పెట్టాను. వరద నీట మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలాగే మా గ్రామం వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది.
– మారుతి పటేల్, రైతు, ఖాజాపూర్

అవస్థలు పడ్డాం..



మంజీర వరద నీరు మా ఇళ్ల చుట్టూ చేరింది. నాతోపాటు ఐదుగురు కుటుంబ సభ్యులమంతా మూడు రోజుల పాటు ఇతర సురక్షిత ప్రాంతంలో ఆశ్రయం పొందాం. నివాసాల్లోకి వరద నీరు చేరడంతో తీవ్ర అవస్థలు పడ్డాం.
– లక్ష్మి, మందర్నా

తినడానికి ఏం లేకుండా పోయింది..



వరద పోటెత్తడంతో తాత్కాలికంగా నిర్మించుకున్న రేకుల ఇంట్లోని సామగ్రి పూర్తిగా పాడైపోయింది. పప్పులు, బియ్యం, ఇతర వస్తువులు నీటి పాలయ్యాయి. వండుకొని తినడానికి కూడ ఏమీ లేకుండా పోయింది.
– శాంతబాయి, హంగర్గ

పెన్షన్ విధానాల రద్దుకు జంగ్ సైరన్



ధర్పల్లిలో ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- నేడు నూతన పెన్షన్ విద్రోహదినం
- ధర్నాకు తరలనున్న 5వేల మంది

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరైన ఆర్థిక భద్రత ఇవ్వని సీపీఎస్, యూపీఎస్ పథకాలను రద్దు చేయాలని వేతన జీవులు కోరుతున్నారు. ప్రభుత్వానికి భారం కాని, నయా పైసా ఖర్చు లేని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 15,600 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్, యూపీఎస్ విధానంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే సెప్టెంబర్ 1న సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా రాష్ట్రంలో ప్రధాన ఉపాధ్యాయ సంఘమైన పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో మహాధర్నా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి దాదాపుగా 5వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ మహాధర్నాలో పాల్గొనే అవకాశాలున్నాయి. సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

హామీని అమలు పరచాలి
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలి. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.
– గజ్జి శ్రీనివాస్, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

శోభాయాత్ర రూట్‌లను సిద్ధం చేయాలి

- సీపీ సాయిచైతన్య

ఆర్మూర్‌టౌన్: గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సాగే రహదారులను సిద్ధం చేయాలని సీపీ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ పట్టణంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ప్రధాన రూట్, రహదారి మరమ్మతు పనులు, గూండ్ల చెరువు వద్ద ఉన్న నిమజ్జన ఘాట్‌లను సందర్శించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. శోభాయాత్ర జరిగే సమయంలో ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్‌ను కఠినంగా అమలు చేయాలని, కీలక జంక్షన్ల వద్ద ప్రత్యేక బృందాలను మోహరించాలని సూచించారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ సిబ్బంది శ్రీ చందు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



గూండ్ల చెరువును పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

భారీ గణపతుల నిమజ్జనానికి రూట్ ఇదే..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో ఈ నెల 6న నిర్వహించనున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా సీపీ సాయిచైతన్య పలు సూచనలు చేశారు. హైటెన్షన్ రైల్వే లైన్ నేపథ్యంలో భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వెళ్లాల్సిన రూట్‌లను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 ఫీట్లలోపు విగ్రహాలను నెహ్రూపార్క్, అర్సపల్లి, జాన్కంపేట్, నవీపేట మీదుగా బాసరకు వెళ్లాలి. 8 ఫీట్ల కంటే ఎత్తు ఉన్న విగ్రహాలను పులాంగ్– ఎన్టీఆర్ చౌరస్తా– రైల్వే స్టేషన్– బస్టాండ్– రైల్వే ఓవర్ బ్రిడ్జి–శివాజీ చౌక్– దుబ్బా– జీజీ కాలేజీ చౌరస్తా–బైపాస్ రోడ్డు– డీఎస్ చౌరస్తా–ముబారక్ నగర్– మాణిక్ బండార్– దాస్‌నగర్–మాక్లూర్–నందిపేట్ మండలంలోని ఉమ్మెడ గ్రామంలోని గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లాలని తెలిపారు. ఇదే రూట్‌లో నందిపేట నుంచి నవీపేట్ మీదుగా బాసర గోదావరి బ్రిడ్జికి వెళ్లొచ్చని పేర్కొన్నారు. పోలీసులకు సహకరిస్తూ శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీకి తగ్గిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తోన్న వరద ఆదివారం తగ్గుముఖం పట్టింది. శనివారం రాత్రి 5.4 లక్షల క్యూసెక్కుల నీరు రాగా, ఆదివారం 3.25 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి కూడ నీటి విడుదలను క్రమంగా తగ్గించారు. 39 వరద గేట్ల ద్వారా 2.5లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 18వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 622 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం రాత్రికి ప్రాజెక్ట్‌లో 1088.2(70.42 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

బోరు బావి నుంచి ఉబికి వస్తున్న నీరు



బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో బద్దం సువర్ణకు చెందిన పంట భూమి లోగల బోరు బావి నుంచి నీరు మోటారు ఆన్ చేయకుండనే ఉబికి వస్తుంది. గత పక్షం రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది, నీరు వస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా ముందుకు సాగాలి



నిజామాబాద్‌నాగారం: బాలబాలికలు, యువత ఒలింపిక్స్ లక్ష్యంతో ముందుకు నడవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ మైదానంలో ఆదివారం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న క్రీడాకారులు నచ్చిన ఆటలో ఆడుతూ ఉన్నతంగా ఎదగాలన్నారు. డీఈవో అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. విశిష్ట సేవలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారి పవన్ కుమార్, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, రాజేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి శంకర్, సురేందర్, స్వామి, రమేష్, చిన్నయ్య, నగేష్, అస్మత్ పాల్గొన్నారు.

అన్నదాతకు అనుకోని కష్టం..



బినోల శివారులో మునిగిన వరి పంట

- భారీ వర్షాలు, మంజీర, గోదావరి నదులు ఉప్పొంగడంతో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

బోధన్/బోధన్‌రూరల్/రెంజల్/నవీపేట్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా మంజీర, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పరీవాహక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. భారీ వరద రావడంతో వేలాది ఎకరాల్లో సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టంపై రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర పర్యటన చేస్తూ పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు వరదపాలు కావడంతో అన్నదాతలు కన్నీటిపర్యాంతమవుతున్నారు. అలాగే పలు మండలాల్లో కోళ్ల ఫారాలు నీటమునిగి కోళ్లు మృతిచెందాయి. ఇళ్లలోని సామగ్రి తడిచిపోయాయి.



హున్సాలో తుంగను తొలగిస్తున్న రైతులు

ప్రభుత్వం ఆదుకోవాలి



నా సొంత రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన సోయా పంట వరదనీటిలో మునిగి పూర్తిగా నష్టం వాటిల్లింది. సోయా పైరు రంగు మారి ముిరిగిపోతుంది. సోయా ఏపుగా పెరిగడంతో దిగుబడిపై ఎంతో ఆశలు పెట్టుకుంటే వరద కారణంగా నష్టాలపాలయ్యాం.

–సిద్ధార్థ, రైతు హున్సా గ్రామం, సాలూర మండలం

సోయా మొత్తం పోయింది..



సొంత పొలం 20 ఎకరాలు, కౌలు 10 ఎకరాల్లో సోయా పంటను సాగు చేశాను. ఆరుగాలం శ్రమించి పంటను సాగు చేస్తే చేతికందే సమయంలో మంజీర వరద ఉధృతితో పంట చేతిరాకుండా పోయింది. పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

–శివ కుమార్, రైతు, హంగర్గ, బోధన్ మండలం

రెండు పంటలు దెబ్బతిన్నాయి..



ఇక్కడ ప్రధానంగా పొగాకు, సోయా, శనగ పంటలనే సాగు చేస్తారు. వరికి ఇక్కడి నేలలు అనుకూలం కాదు. పొగాకు సాగు చేసి కంపెనీల చేతిలో తీవ్రంగా నష్టపోయిన రైతులు సోయాపై ఆశలు పెట్టుకున్నారు. కానీ రెండు పంటలు పూర్తిగా దెబ్బ తీశాయి. రెండు పంటలకు పెట్టుబడులను కోల్పోవాల్సి వచ్చింది.

– సిరాజ్‌బేగ్, రైతు కందకుర్తి, రెంజల్ మండలం

రాకపోకలు నిలిచిపోయాయి.



మిట్టాపూర్ గ్రామం చుట్టూ వరద నీరు చేరింది. బయటకు వెళ్లలేకపోతున్నాం. ఎప్పుడూ ఇలా జరగలేదు. కూరగాయలు లేవు. గ్యాస్ అయిపోయింది. వంటకు ఇబ్బంది అవుతుంది. మిట్టాపూర్ నుంచి బాసర రహదారి వరకు బ్రిడ్జి నిర్మిస్తే మాకెలాంటి అపాయం ఉండదు.

–లక్ష్మి, గృహిణి, మిట్టాపూర్, నవీపేట మండలం

నష్టపరిహారం చెల్లించాలి..



నా సొంత భూమి 3 ఎకరాల్లో సోయా, 2 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను, ఎకరానికి రూ. 30 వేల వరకు ఖర్చు పెట్టాను. వరద నీటికి పంటలు మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కాత దశలో ఉన్న సోయా కుళ్లిపోతుంది. పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

–శివరాజ్, రైతు, హున్సా, సాలూర మండలం

8వేల ఎకరాల్లో పంట నష్టం..

బోధన్ నియోజకవర్గంలో 18 వేల 300 ఎకరాల్లో రైతులు సోయాను సాగు చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం 8వేల 500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించాం. పలు గ్రామాల్లో ఇప్పటికీ వరద నీటిలోనే పంటలు ఉన్నాయి. నీరు తగ్గాక పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తాం.

– అలీముద్దిన్, ఏడీఏ బోధన్

నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం



హంగర్గలో వరద నీరు వెళ్లిపోవడంతో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. వరదతో నష్టపోయిన బాధితులకు కనీస అవసరాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. వరద నీటితో నీట మునిగిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులతో నివేదిక రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం.

– పట్నం విఠల్, తహసీల్దార్, బోధన్

వర్షాకాలంలో ఇబ్బందులే..



నాకు అల్జాపూర్ శివారులో నాకు 14 ఎకరాల భూమి ఉంది. లక్షలు ఖర్చు చేసి బోర్లు, పైపులైన్ వేశాను. మొత్తం భూమిలో వరి పంట వేశాను. కానీ వరద నీరు చేరి పంట కనిపించడం లేదు. నీరు తగ్గినా..బురద, ఇసుక మేటలు తిష్ట వేస్తాయి. ప్రతి వర్షాకాలంలో ఇలాగే జరుగుతుంది. కానీ ఈసారి బాగా నష్టం జరిగింది. పంట పండడం కష్టమే.దాదాపు రూ.8 లక్షల నష్టం వాటిల్లింది.

–మహదేవ్, రైతు, అల్జాపూర్, నవీపేట మండలం..

కొట్టుకుపోయిన 9 వేల కోళ్లు..

నవీపేట మండలంలోని ఫకీరాబాద్‌కు చెందిన ఇందూర్ హరీశ్‌కు కోస్లీ శివారులో కోళ్ల ఫారం ఉంది. వరద ఉధృతికి షెడ్డు పూర్తిగా నీట మునిగింది. అందులోని 9 వేల కోళ్లు కొట్టుకుపోయి రూ. 20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

రూ.7 లక్షలు నష్టపోయా..



12 ఎకరాలలో వరి పంట వేశాను. పచ్చగా పెరగడంతో దిగుబడి బాగానే వస్తుందని ఆశ పడ్డాను. కానీ గోదారమ్మ కోపానికి ఆశలు గల్లంతయ్యాయి. దాదాపు రూ. 7 లక్షల నష్టం వాటిల్లింది.

– ఏసప్ప ఈరన్న, రైతు, అల్జాపూర్

విలువైన వస్తువులు పాడయ్యాయి..



గతంలో ఎన్నడూ లేనివిధంగా మా ఊర్లోకి వరద నీరు వచ్చింది. ఇంట్లోని బీరువాలు, టీవీలు, ఫ్రిడ్జిలు పూర్తిగా పాడైపోయాయి. రూ.వేలల్లో నష్టపోయాం.

– గంగుబాయి, హంగర్గ, బోధన్ మండలం



మిట్టాపూర్ శివారులో బురద నీటిలో వరి

ఉమ్మెడ బ్రిడ్జిపై పర్యాటకుల సందడి





నందిపేట మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద పర్యాటకుల సందడి.. ఎస్సారెస్పీ ప్రాజెక్టుపై..

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని ఉమ్మెడ బ్రిడ్జి వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. గత వారం రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఎన్నడు లేనివిధంగా గోదావరి నది ఉధృతంగా పరవళ్లు తొక్కుతు ప్రవహిస్తోంది. దీంతో ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి ప్రవాహాన్ని తిలకిస్తున్నారు. బ్రిడ్జికి ఆనుకుని ప్రవహిస్తున్న వరద నీరు వద్ద సెల్ఫీలు తీసుకుని సంబురపడుతున్నారు. కొందరు పర్యాటకులు నీటి అంచుకు వెళ్లి సెల్ఫీలు దిగుతున్నారు. ఈక్రమంలో వరద ఉధృతి పెరిగితే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఉమ్మెడ బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బాల్కొండ: ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది. ఈక్రమంలో ప్రాజెక్టును తిలకించడానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్ట్ అందాలను చూసి, సెల్ఫీలు దిగారు. భద్రత కారణాల వల్ల అధికారులు సాయంత్రం వేళ కొంత సమయం మాత్రమే పర్యాటకులను ప్రాజెక్టుపైకి అనుమతి ఇస్తున్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన కొమ్ముల శ్రీనివాస్ అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ ఆదివారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి అతడిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య యత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

సాదాబైనామాలకు చట్టబద్ధత?

- భూభారతి చట్టంలో ఆప్షన్ కల్పించే అవకాశం
- గతంలో విధించిన స్టేను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు



మోర్తాడ్(బాల్కొండ): సాదాబైనామాలపై రాసుకున్న భూ విక్రయ ఒప్పంద పత్రాలకు చట్టబద్ధత కల్పించడానికి భూభారతి ద్వారా లైన్ క్లియర్ కానుంది. గతంలో రెవెన్యూ చట్టం సవరించక ముందు సాదాబైనామాలకు పట్టాలు జారీ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయడానికి ఆప్షన్ ఇచ్చినా చట్టంలో ఉన్న చిక్కులతో అది సాధ్యం కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతిలో సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించే అంశం ఉండటంతో హైకోర్టు గతంలో విధించిన స్టేను కొట్టివేసింది.

పట్టా భూములకే అవకాశం..

పట్టా భూములకు సంబంధించి సాదాబైనామాలు ఉంటేనే పట్టాలను జారీ చేయనున్నారు. గతంలో పీవోటీ(అసైన్డ్) భూములకు పట్టాలను జారీ చేశారు. ఈసారి మాత్రం సీలింగ్, షెడ్యూల్డ్ ఏరియా, పీవోటీ చట్టాల పరిధిలో ఉన్న వాటిని మినహాయించారు. జిల్లాలో సాదాబైనామాలకు వచ్చిన దరఖాస్తులలో పీవోటీకి సంబంధించి ఎక్కువ శాతం ఉండే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఆర్డీవో ద్వారా సాదాబైనామాలకు సంబంధించి నోటీసులను జారీ చేయనున్నారు. అఫిడవిట్ స్వీకరించిన తర్వాత ఆర్డీవోనే స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి సాదాబైనామా వాస్తవమా కాదా అని నిర్ధారించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా అసైన్డ్ భూములకు సంబంధించి క్రయ విక్రయాలు జరిగితే వాటికి కూడా సాదాబైనామాలు వర్తించే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో 25,345 దరఖాస్తులు..

గతంలో సాదాబైనామాలకు పట్టాలను జారీ చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 25,345 దరఖాస్తులు అధికారులకు అందాయి. రెండు నెలల కింద నిర్వహించిన భూభారతిలోను దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలకు సంబంధించి 40,468 దరఖాస్తులు అందగా ఇందులో సాదాబైనామాల వినతులు ఎన్ని ఉన్నాయో లెక్క తీయాల్సి ఉంది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌లకు తక్కువ చార్జీలు వర్తిస్తే నేరుగా చేసే రిజిస్ట్రేషన్‌లకు కొంత ఎక్కువ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సాదాబైనామాలపై సంతకాలు చేసిన భూమి యజమాని లేకపోతే వారి వారసుల వాంగ్మూలం తీసుకొని చట్టబద్ధత కల్పించడానికి అవకాశం ఉంది. అనేక మంది భూములను కొనుగోలు చేసినా సరైన పత్రాలు లేకపోవడం, ప్రభుత్వానికి ఫీజు చెల్లించలేక సాదాబైనామాలపై రాసుకుని కబ్జాలో ఉండిపోయారు. ఇలాంటి వాటికి ఐదేళ్ల తరువాత మోక్షం లభించనుండటం విశేషం.

సరైన నిర్ణయం..



సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని ప్రభుత్వం సరై న నిర్ణయం తీసుకుంది. అనేక మంది సాదాబైనామాలకు ప ట్టాలు పొందాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ప ట్టాలు జారీ కాకపోవడంతో అనేక మందికి రుణా లు దక్కలేవు. పెట్టుబడి సాయం కూడా నిలచిపోయింది. ఇప్పుడు అన్ని సౌకర్యాలు లభించనున్నాయి.

–బద్దం రాజశేఖర్, రైతు, తిమ్మాపూర్

అన్ని రకాల భూములకు ఇవ్వాలి



కేవలం పట్టా భూములకు సంబంధించి సాదాబైనామాలను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదు. ఎంతో మంది చిన్న, సన్నకారు రైతులు అసైన్డ్ భూములను కొనుగోలు చేసుకున్నారు. అలాంటి వాటికి కూడా చట్ట బద్ధత కల్పిస్తే ఎంతో బాగుటుంది. ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

–పాపాయి పవన్, రైతు, మోర్తాడ్

పెండింగ్ దరఖాస్తులకు లభించనున్న మోక్షం..

సాదాబైనామా దరఖాస్తులు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిల్లో ఎలాంటి సమస్యలేని దరఖాస్తులకు సంబంధించి త్వరిత గతిన పరిష్కారం లభించనుంది. ఏమైనా చట్టపరమైన చిక్కులు ఉంటే మాత్రం అలాంటి దరఖాస్తులను పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. లేదా తిరస్కరించే అవకాశం ఉంది. – కృష్ణ, తహసీల్దార్, మోర్తాడ్

క్రైం కార్నర్

ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరి మృతి



నాగేంద్ర (ఫైల్)

బాల్కొండ: ట్రాక్టర్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ముప్కాల్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పొట్టి శ్రీరాములు జిల్లా కొత్త పట్టణం మండలం గోవింద పల్లె గ్రామానికి చెందిన బుదురు నాగేంద్ర (23) కొన్ని నెలలుగా ముప్కాల్ మండలం నల్లూర్ శివారులోని ఇటుక బట్టిలో పనిచేస్తుండేవాడు. ఆదివారం అతడు తోటి కార్మికులతో కలిసి ట్రాక్టర్‌లో ఇటుక లోడ్ తీసుకొని మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి వెళ్లాడు. అన్‌లోడ్ అనంతరం తిరిగి అదే ట్రాక్టర్‌పై ఇటుక బట్టికి బయలుదేరారు. నాగంపేట్ శివారులో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అతడు ట్రాక్టర్ పైనుంచి కిందపడిపోయాడు. ఈఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాం నగర్ కాలనీలోగల ఓ ఇంట్లో పనిచేస్తుండగా ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రకు చెందిన నాందేవ్ (45) పెయింటర్ పనులు చేస్తుండేవాడు. నగరంలోని సీతారాం నగర్ కాలనీలో ఓ ఇంటి నిర్మాణం జరుగుతుండగా పనుల నిమిత్తం అతడు వచ్చాడు. ఇంట్లో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో నాందేవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు..

మాక్లూర్: మండలంలోని ఒడ్డెట్‌పల్లి గ్రామంలో ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్‌లోని గౌడ కాలనీకి చెందిన గుడికందుల యాదాగౌడ్ (50) ఆదివారం ఉదయం ఒడ్డెట్‌పల్లిలో ఈత చెట్లకు కల్లుగీయటానికి వచ్చాడు. రాత్రయినా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఒడ్డెట్‌పల్లిలోని ఈతచెట్ల వద్దకు వచ్చారు. ఓ చెట్టు కింద యాదాగౌడ్ మృతిచెంది ఉన్నట్లు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు చెట్టుకు కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్ వచ్చి రోడ్డు పైపడ్డ వ్యక్తి.. కాపాడిన పోలీసులు



ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్ వద్ద ఆదివారం సాయంత్రం ఒక గుర్తు తెలియని వ్యక్తి కంఠేశ్వర్ జంక్షన్ వద్ద ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిపోయారు. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ శేఖర్ బాబు, దినేష్, ఉమెన్ కానిస్టేబుల్ స్వప్న వెంటనే స్పందించి వ్యక్తికి సపర్యాలు చేసి, కాపాడారు. అనంతరం 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. సిబ్బందిని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ అభినందించారు.

వరదలో కొట్టుకువచ్చిన వ్యక్తి మృతదేహం




ముళ్లపొదల్లో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు అలుగు ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కామారెడ్డి పెద్ద చెరువు అలుగు ప్రాంతంలోని చెట్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహంను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్యాంటు జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఇతర ఆనవాళ్లతో మృతుడిని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన కరివేపాల బాలరాజు (50)గా గుర్తించారు. నెల క్రితం అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల్లో అతడు గల్లంతై చెరువు వరదలో కొట్టుకుపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే హత్య

- సిర్‌పూర్‌లో మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



మద్నూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మద్నూర్(జుక్కల్): తమ వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భర్తను ప్రియుడితోకలిసి భార్య హతమార్చిన ఘటన డోంగ్లీ మండలం సిర్‌పూర్‌లో చోటుచేసుకుంది. నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, బిచ్కుంద సీఐ రవి, ఎస్సై విజయ్‌కొండ వివరాలు వెల్లడించారు. డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన మాగిరి రాములు(35)కు భార్య మాదాబాయి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. అతడు చేపలు పడుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అగస్టు 23 నుంచి రాములు కనబడకుండపోవడంతో అతడి అక్క లక్ష్మీబాయి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆగస్టు 30న మంజీర నదిలో రాములు మృతదేహం లభ్యమైంది. అదేరోజు సిర్‌పూర్ గ్రామానికి చెందిన ఉప్కల్‌వార్ శంకర్, రాములు భార్య మాదాబాయి ఇద్దరు కలిసి బైక్‌పై మద్నూర్ వైపు వస్తుండగా వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు వారిని విచారించారు. దీంతో రాములును వారే హత్య చేసినట్లు తెలిపారు. మాదాబాయికి శంకర్‌తో వివాహేతర సంబంధం ఉండగా, భర్త అడ్డును తొలగించుకోవాలనుకుంది. ఈక్రమంలో ఆగస్టు 22న రాములుకు శంకర్ ఫుల్లుగా మద్యం తాగించి, సాలూరలోని మంజీర బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ రాములను అతడు కత్తితో పొడిచి, బ్రిడ్జి పైనుంచి మంజీర నదిలో పడేశాడన్నారు. శంకర్, మాదాబాయి ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

జనావాసాల మధ్య బార్

- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఇళ్ల మధ్య ఇటీవల ఓ బార్ ప్రారంభమైంది. దీంతో బార్‌లోని వ్యర్థాలు రోడ్లపై పడేయడంతోపాటు, వంటశాల నుంచి వచ్చే దుర్వాసన, భారీ శబ్దాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బార్‌కు రెండు వైపులా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మరోవైపు హనుమాన్ ఆలయం ఉంది. అలాగే చుట్టుపక్కల నివాసాలు ఉన్నాయి. అయినా ఇళ్ల మధ్య బార్‌కు అనుమతి ఎలా ఇస్తారంటూ స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు చెందిన బంధువు ఈ బార్‌ను ప్రారంభించారు. దీంతో అనుమతులు తేలికగా తీసుకున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కాలనీవాసులు పేర్కొన్నారు.

కారేగాంలో వృద్ధుడి అదృశ్యం

రుద్రూర్: పోతంగల్ మండలం కారేగాం గ్రామానికి చెందిన పందిరి బుడ్డ చిన్నబోయి (64) అదృశ్యమైనట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. ఈనెల 29న రాత్రి అతడు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు ఆదివారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.